క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఓం ప్రకాష్

పెంచికల్‌పేట్: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్ అన్నారు. సోమవారం మండలంలోని గుంట్లపేట్, ఎల్లూర్, కొండపల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీవో గంగాసింగ్, ఏడీఏ రాజుల నాయుడు, సర్పంచ్ చంద్రమౌళి, ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, డైరెక్టర్ వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంఎస్‌వో ప్రకాశ్

కెరమెరి: మన ఊరు -మన బడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని బారేమోడి గ్రామంలో కొనసాగుతున్న మన ఊరు -మన బడి పనులను ఆయన పరిశీలించారు. ఈ పనులపై ప్రభుత్వం ఎంతో సీరియస్‌గా ఉందని వారం రోజుల్లోగా నిర్దేశించిన పనులు పూర్తి చేయాలని గుత్తేదారుకు ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

మానవత విలువలు పెంపొందించడానికే బాలవికాస్

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థుల్లో మానవత విలువలు పెంపొందించడానికే బాలవికాస్ కార్యక్రమం దోహద పడుతుందని సత్యసాయి ఆర్గనైజేషన్ జిల్లా యూత్ ఇన్‌చార్జి కె.సతీష్, జిల్లా బాల వికాస్ ఇన్‌చార్జి భార్గవిలు అన్నారు. సోమవారం స్థానికంగా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ 6 నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులకు సనాతన ధర్మం బోధించడంతో పాటు వారిలో ఆధ్యాత్మిక విలువలతో కూడిన పద్యాలు, శ్లోకాలు నేర్పించనున్నట్లు తెలిపారు. ప్రతీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు.

'రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం'

బెజ్జూర్: ప్రాణహిత వరదలతో ఏటా నష్టపోతున్న రైతులను ఆదుకోవడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని నాగెపెల్లి, మొగవెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె పల్లెకు పాల్వాయి -గడప గడపకు బీజేపీ పాదయాత్రలో భాగంగా నాగెపెల్లి గ్రామస్తులతో కలిసి ప్రాణహిత పరీవాహక ప్రాంతాన్ని సందర్శించారు. నాగెపెల్లి వద్ద ప్రాణహిత నది ఒడ్డున లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఏర్పాటు చేస్తే రైతులకు లాభం చేకూరుతుందన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం	: రామబాణం

కాగజ్‌నగర్

వెంకటరమణ	: రామబాణం

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	40
చామగడ్డ	60
వంకాయ	40
బీరకాయ	80
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	60
పచ్చిమిర్చి	60
పాలకూర	60
సోరకాయ	60
రతాళం	60
గోబి(పూల్)	80
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

అక్కడ రోజూ భూకంపమే..!

పచ్చని చెట్లు, చుట్టూ పంటపొలాలు, పక్షుల కిలకిలరాగాలు, వ్యవసాయమే ఊపిరిగా బతికే పల్లె ప్రజలు, పాడి పంటలతో 20 ఏళ్ల క్రితం వరకు ఆ ఊరంతా కళకళలాడేది. స్టోన్ క్రషర్ల రంగప్రవేశంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. సమీప పంటచేలు కనుమరగయ్యాయి. గ్రామ శివారు బొందలగడ్డగా మారింది. కౌటాల మండలం ముత్తంపేట గ్రామ శివారు కంకర క్వారీలో బ్లాస్టింగ్‌ల కారణంగా సమీప గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



ముత్తంపేట గ్రామ శివారులోని క్వారీ

- ముత్తంపేట శివారులో కంకర క్వారీ
- బ్లాస్టింగ్‌తో ఇళ్లకు బీటలు
- చేలల్లో పడుతున్న బండరాళ్లు
- దుమ్ము, ధూళితో వ్యాధులబారిన ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



కౌటాల -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై టిప్పర్లలో బండరాళ్లు తరలిస్తున్న టిప్పర్లు

కౌటాల: మండలంలోని ముత్తంపేట గ్రామ శివారులో 20 ఏళ్లుగా కంకర క్వారీలు కొనసాగుతున్నాయి. రాళ్ల పెద్దమొత్తంలో తవ్వేందుకు కొన్నేళ్లుగా పేలుడు పదార్థాలను ప్రమాదకరంగా పేలుస్తున్నారు. ముత్తంపేట శివారులో 4 కంకర స్టోన్ క్రషర్లు ఉండగా వరుసగా పెద్దఎత్తున పేలుళ్లు చేస్తుండడంతో పరిసరాల్లోని 4 కిలోమీటర్ల మేర ఉన్న కౌటాల, పార్డీ, సాండ్గాం, ముత్తంపేట, శీర్షా గ్రామాల ప్రజలు తీవ్రంగా భయాందోళన చెందుతున్నారు. ప్రతీరోజు సాయంత్రం 7 నుంచి 8 గంటల ప్రాంతంలో క్వారీల్లో బ్లాస్టింగ్ జరుపుతున్నారు. బ్లాస్టింగ్‌లతో ఎప్పుడు ఎటువైపు నుంచి బండరాళ్లు వచ్చి మీద పడుతాయోనని ఆందోళన చెందుతున్నారు. పేలుడు జరిపిన సమయంలో భూకంపం వచ్చినట్లుగా ప్రకంపనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లాస్టింగ్ ధాటికి గోడలు బీటలు వారాయని, బండరాళ్లు సమీప చేనుల్లో వచ్చి పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

రక్షణ చర్యలు శూన్యం..

రాత్రి, పగలు సాగుతున్న క్వారీల తవ్వకాలు, టిప్పర్ల అధిక లోడు, అతివేగంగా వాహనాలు దూసుకుపోతుండడంతో ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న నిర్వాహకులు పెద్ద బండరాళ్లతో వాహనాలు నడిపిస్తుండటమే కాక కనీసం టిప్పర్ వెనుక భాగంలో బండరాళ్లు జారకుండా ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ఏదైనా ఘటన జరిగినప్పుడే అధికారులు హడావుడి చేయడం తప్పా సదరు నిర్వాహకులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న స్టోన్ క్రషర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దుమ్ముతో రోగాలు..

ధనార్జనే ధ్యేయంగా నిబంధనలు పట్టించుకోకుండా స్టోన్ క్రషర్లను కొనసాగిస్తున్నారు. ఎంత తవ్వుతున్నారో. ఎంతమేరకు హద్దులు ఉన్నాయో ఇంతవరకు గనుల శాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ఇదే అదునుగా క్వారీ యజమానులు ఇష్టారీతిన బ్లాస్టింగ్ చేస్తున్నారు. బ్లాస్టింగ్ అనంతరం ఊరంతటిని దుమ్ము, ధూళి కప్పేస్తోందని, దీంతో వృద్ధులు, చిన్నపిల్లలు వ్యాధుల బారిన పడుతున్నారని ముత్తంపేట వాసులు వాపోతున్నారు. క్రషర్ నిర్వహణకు సంబంధించి నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నా ఇక్కడ అమలు కావడం లేదు. పేలుళ్ల కారణంగా భారీ రాళ్లు చేలో వచ్చి పడుతున్నాయి. దుమ్ము కారణంగా పంటల దిగుబడి సైతం బాగా తగ్గుతుందని సమీప గ్రామాల రైతులు వాపోతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

స్టోన్ క్రషర్ల నిర్వాహకులు నిబంధనల ప్రకారం బ్లాస్టింగ్ చేపట్టడంతోపాటు కంకర తరలించాలని క్వారీ యజమానులను ఆదేశించాం. వాహన సామర్థ్యం మేరకే కంకర తరలించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే ఉన్నతాధికారులతో కలిసి తనిఖీ చేస్తాం. పరిమితికి మించి కంకర తీసుకెళ్తే కేసులు నమోదు చేస్తాం.

- నాగరాజు, ఏడీ, గనులశాఖ, ఆసిఫాబాద్

డయాలసిస్ కేంద్రం వినియోగించుకోవాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

కాగజ్‌నగర్‌టౌన్: కిడ్నీ బాధితులు కాగజ్‌నగర్‌లోని డయాలసిస్ కేంద్రం సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. ఎల్లాగౌడ్ తోటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్యసిబ్బంది రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా నిర్వహణను పరిశీలించారు. ధరణి పోర్టల్‌లో దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్యాధికారి విద్యావతి తదితరులు ఉన్నారు.

జిల్లా ఆస్పత్రిలో ప్రారంభించేందుకు చర్యలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా ఆస్పత్రిలో త్వరలో డయాలసిస్ సేవలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం తనిఖీ చేశారు. రోగులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. సూపరింటెండెంట్ స్వామి, వైద్యులు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

ఆసిఫాబాద్: స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ రాజేశం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. నూతన ఓటర్ల నమోదు కోసం దరఖాస్తులు వచ్చినందున బూత్‌స్థాయి అధికారులతో స్థానికంగా విచారణ చేసి నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికలకు పూర్తిస్థాయి ఓటర్ల జాబితా రూపొందించడంలో రాజకీయపార్టీల పాత్ర ఉంటుందని, 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఓటరు వివరాలు జాబితాలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జాబితాలను రాజకీయ ప్రతినిధులు పరిశీలించి అభ్యంతరాలుంటే తహసీల్దార్లు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, ఎన్నికల డీటీ జితేందర్, అధికారులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం



వాటర్ ట్యాంక్ ప్రారంభిస్తున్న పోలీస్ అధికారులు

తిర్యాణి: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ నిత్యం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని సీఐ అల్లం నరేందర్, ఎస్సై రమేశ్ అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో సమర్థియన్స్ ఆఫ్ ది నేషన్స్ సహకారంతో చేపట్టిన సేవా కార్యక్రమాలను వారు ప్రారంభించారు. మండల కేంద్రంలోని ఆసుపత్రిలో ఆవిరి మిషన్లు, బీపీ ఆపరేటర్, గ్లూకో మీటర్ అందజేశారు. రాజుగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన 5వేల లీటర్ల వాటర్ ట్యాంకును ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పోలీసులు ముందుంటారన్నారు. మారుమూల ప్రాంతాల ప్రజలు అసాంఘిక శక్తులకు ఆకర్షితులు కాకుండా మెరుగైన సమాజం కోసం తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పీవీ ప్రసాద్, రాము, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

కౌటాల: అగ్ని ప్రమాదంలో ఇళ్లు దగ్ధమైన మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన బెండారె నాందేవ్, బెండారె వాగు కుటుంబాలకు సోమవారం పలువురు ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాలకు కౌటాల సహాయ సంఘం సభ్యులు రూ.15 వేలు ఆర్థిక సాయం, క్వింటాల్ బియ్యం అందించారు. చింతలమానెపల్లి మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కౌటాల సీఐ సాధిక్‌పాషా, మా ఫౌండేషన్ సభ్యులు లోడెల్లి ప్రవీణ్‌లు క్వింటాల్ బియ్యంతో పాటు నగదు, నిత్యావసర సరుకులు, బట్టలు అందజేశారు. ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ బట్టలు, వంట సామగ్రి, దుప్పట్లు అందించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆదే వసంత్‌రావ్, సర్పంచ్ ఆదే శ్రీనివాస్, సహాయ సంఘం సభ్యులు రాజేందర్‌గౌడ్, దత్తు, వినోద్ గౌడ్, అశోక్, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో 54 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేసి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, స్వర్ణలత, గిత్తే ఆశాబాయి, నాయకులు పాల్గొన్నారు.

సమస్య విని.. చార్జింగ్ పెట్టించి



సమస్య తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్



సీసీకి సెల్‌ఫోన్ అందజేస్తున్న అదనపు కలెక్టర్

కెరమెరి మండలం అంకుషాపూర్‌కు చెందిన ఆత్రం కవితబాయి ఇద్దరు పిల్లలు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం పారగూడలో బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో పాటుకాటుతో మృతిచెందారు. పిల్లలను కోల్పోయిన తనకు ఆర్థికసాయం అందించాలని కోరుతూ సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషాకు విన్నవించింది. ఆయన ఈ విషయంపై ఐటీడీఏ అధికారులతో మాట్లాడి అధికారులు ఫోన్ చేస్తారని, స్పందించాలని బాధితురాలికి తెలియజేశారు. ఆసమయంలో ఆమె సెల్‌ఫోన్ చార్జింగ్ లేకపోవడంతో అదనపు కలెక్టర్ ఫోన్ తీసుకుని సీసీకి అందజేసి చార్జింగ్ పెట్టించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్రీడాపోటీలు విజయవంతం చేయాలి



కెరమెరి: మాట్లాడుతున్న ఎంపీపీ, ఎంపీడీవో

కెరమెరి: సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించనున్న క్రీడాపోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ పెందోర్ మోతీరాం, ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 15 నుంచి 36 వయస్సు గల యువతీ, యువకులు క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో వంటి క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్, మెమోంటోలు అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్‌కు ఈ నెల 10లోగా సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ జమీర్, ఎస్సై వెంకటేశ్, ఎంపీవో సుదర్శన్, ఎంఎస్‌వో ప్రకాశ్ నాయకులు ఉన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలు

వాంకిడి: ఈ నెల 15వ తేదీ నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. మండలస్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, రన్నింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 11 తేదీలోపు ఎంపీడీవో కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొనాలనుకునే వారు కూడా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. జిల్లా స్థాయిలో స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, బేస్‌బాల్, రెజ్లింగ్, షాట్‌పుట్, లాంగ్‌జంప్ క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని రైతుబంధు సమితి మండల కన్వీనర్ మెర్వెల్లి బ్రహ్మయ్య, కౌటాల మాజీ ఎంపీపీ నికాడే గంగారం అన్నారు. మండలంలోని యాపలగూడ గ్రామంలో నిర్వహిస్తున్న స్మారక క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన యాపలగూడ జట్టుకు మొదటి బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి చిలపల్లి జట్టుకు రూ.10 వేల నగదు అందించారు. నాయకులు లహాను, నిరంజన్, విశ్వనాథ్, రావుజీ, శంకర్, లక్ష్మణ్, శ్రీకాంత్, గణపతి, గోవింద్‌రావ్, వెంకటేశ్, శ్యాంరావ్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


'కేర్ ఇండియా' సేవలు అభినందనీయం



సామగ్రితో సావిత్రి, సిబ్బంది

వాంకిడి: కేర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సహకారంతో సామేల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంగా రూపొందించడం అభినందనీయమని డీడబ్ల్యూవో సావిత్రి అన్నారు. మోడల్ అంగన్‌వాడీ కేంద్రంగా తీర్చిదిద్దిన సామేల కేంద్రం ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేర్ ఇండియా ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, గర్భిణులు, బాలింతలకు కల్పిస్తున్న అవగాహన, సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కేర్ ఇండియా ఆధ్వర్యంలో సామేల కేంద్రానికి పెయింటింగ్, విద్యుత్, కుర్చీలు, శుద్ధజలం, పలకలు వంటి వసతులు సమకూర్చి మోడల్ అంగన్‌వాడీగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మారుతి, సీడీపీవో రెబ్కా, కేర్ ఇండియా సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ సంతోష్, ఫీల్డ్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, పోషణ్ కోఆర్డినేటర్ గోపాల కృష్ణ, సీఆర్పీ పితాంబర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాగరాజు

కాగజ్‌నగర్‌టౌన్: విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో సోమవారం నిర్వహించిన జిల్లా ప్లీనరీ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎస్సీ, బీసీ హాస్టళ్లకు పక్కా భవనాలు లేక విద్యార్థులకు అవస్థల మధ్యే చదువులు కొనసాగించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు భీమేశ్, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న 2వ ఏఎన్ఎంలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా అహర్నిశలు వైద్య సేవలు అందిస్తున్న 2వ ఏఎన్ఎంలను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లోకేష్, శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. 2వ ఏఎన్ఎంల సమస్యల పరిష్కారం కోసం సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావ్ బోర్కడేకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2007 నుంచి దాదాపు 200 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్నారని, వీరిని ఇప్పటి వరకు రెగ్యులర్ చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా 2వ ఏఎన్ఎంలను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా 2ఏఎన్ఎంలతో కలిసి సమ్మె చేస్తామని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, సంతోష్, సునీత, పరమేశ్వరి, పుష్ప, సునంద, గోదుబాయి, దివ్యభారతి, సత్తెమ్మ ఉన్నారు.

వీవోఏలను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి



సమ్మెలో పాల్గొన్న వీవోఏలు

దహెగాం: ఐకేపీ వీవోఏల సమ్మె సోమవారం 22వ రోజుకు చేరింది. మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయం ఆవరణలో వీవోఏల సమ్మె కొనసాగుతోంది. పలువురు వీవోఏలు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వీవోఏలు పడాల రాజు, సకారాం, మల్లేష్, తుకారాం, తిరుపతి, లక్ష్మి, సంగీత, నాగమణి పాల్గొన్నారు.